క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం


మహేష్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నేతలు

తిరుపతికల్చరల్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో జిల్లా గౌడ్ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసి, పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్, జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు అలగాని బాబు, మునిశేఖర్ గౌడ్, కాంగ్రెస్ నేతలు రాం భూపాల్‌రెడ్డి, యార్లపల్లి గోపి, వాసు, బుల్లెట్ రవి, శివశంకర్, దామోదర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు

ఈశ్వర్‌బాబుకు లెఫ్టినెంట్ హోదా



పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు, పీఆర్‌ఓ డాక్టర్ ఈశ్వర్‌బాబు లెఫ్టినెంట్ హోదా పొందినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారి(సీటీఓగా పని చేస్తున్న ఈశ్వర్‌బాబు 75 రోజులుగా మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందారని తెలిపారు. అక్కడ నిర్వహించిన పలు పరీక్షల్లో ఈశ్వర్‌బాబు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో లెఫ్టినెంట్ హోదా దక్కిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌బాబుకు అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి ఆర్డీఓగా రామ్మోహన్



తిరుపతి అర్బన్ : తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీఓగా బి. రామ్మోహన్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. బుధవారం ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. రామ్మోహన్ ప్రస్తుతం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

కార్పొరేషన్ ఎస్ఈగా శ్యాంసుందర్


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఈ

తిరుపతి తుడా : తిరుపతి కార్పొరేషన్ ఎస్ఈగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఈ మేరకు కమిషనర్ మౌర్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న మోహన్ బదిలీపై నెల్లూరుకు వెళుతుండడంతో ఆయనను మున్సిపల్ అధికారులు ఘనంగా సత్కరించారు.

అర్హులందరికీ 'స్వనిధి' రుణాలు


బ్యాంకర్లతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : వీధి విక్రయదారుల్లో అర్హులందరికీ పీఎం స్వనిధి పథకం కింద రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ లెవల్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్హులను మెప్మా అధికారులు గుర్తించాలని సూచించారు. పెండింగ్ ఉన్న డాక్యుమెంట్లను వారంలోపు పూర్తి చేసి బ్యాంకర్లకు అందజేయాలని స్పష్టం చేశారు. మెప్మా పీడీ రాధమ్మ, విశ్వనాథరెడ్డి, టీఈలు కృష్ణవేణి, ప్రమీల, శ్రీరాములు పాల్గొన్నారు

50 మందికి వస్త్రాల వితరణ


పంచె, కండువాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 50 మంది మోత కూలీలకు నాయుడుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్ కనమర్ల పూడి సుబ్రమణ్యం, సురేష్ కుటుంబ సభ్యులు వస్త్రాలను వితరణ చేశారు. బుధవారం ఈ మేరకు పంచె, కండువాలను ఆలయ అధికారులకు అందించారు. అనంతరం దాతలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపి స్వామి. అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వివిధ రకాల చేపలు







ఫుడ్ తింటున్న చేప

నిరుపమీనం

అందమైన గాజు తొట్టెలు.. అంత కంటే ఆకర్షించే రకరకాల చేపలు.. ఆకట్టుకునే ఆకృతుల్లో విభిన్నమైన అక్వేరియమ్‌లు అందుబాటులోకి వచ్చేశాయి. ఆధునిక గృహాలకు మరింత శోభనిస్తున్నాయి. నీటిలో ఈదే రంగు రంగుల చేపలు ఇంటి యజమానులకు ఆహ్లాదం పంచుతున్నాయి. పిల్లలను మురిపించి మైమరిపిస్తున్నాయి. పెద్దలకు చక్కటి కాలక్షేపం అందిస్తున్నాయి.

- నగరంలో పెరుగుతున్న అక్వేరియం సంస్కృతి
- రంగురంగుల చేప పిల్లలను పెంచుకునేందుకు జనం ఆసక్తి
- ఇళ్లల్లో ఆకర్షణీయంగా గాజు తొట్టెలు
- మానసిక ప్రశాంతతకు చేపలతో కాలక్షేపం

తిరుపతి మంగళం : ఉరుకుల పరుగుల ప్రపంచంలో మానసిక ప్రశాంతత కోసం ఒక్కొక్కరు ఒక్కో రకమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటారు. ఇళ్లలో పెంపుడు జంతువులను పెంచుకోవడం సర్వ సాధారణం. కానీ తిరుపతి నగరంలో ఆకర్షణీయమైన రంగురంగుల చేపలను పెంచుకుంటున్నారు.

జీబ్రా చేపలు..
ఈ చేపల శరీరంపై నల్లటి, తెల్లటి చారికలు ఉంటాయి. వాటిని జీబ్రా డానియోస్ పూర్తి పేరు. ఇవి యాక్టివ్‌గా ఉంటాయి. భిన్న పరిసరాలకు అనుకూలంగా ఒదిగిపోయే లక్షణాల కారణంగా వీటిని శాస్త్రవేత్తలు రీసెర్చ్ కోసం వాడుతుంటారు. ఇవి ఆరేడు చేపలతో కలిసి గుంపుగా పెరుగుతాయి.

నెమలి నాట్యంలా..
నెమలి ఫించం లాంటి మొప్పలు ఉన్న చేపలు కదులుతుంటే అచ్చం నెమలి నాట్యం చేస్తున్నట్లే అనిపిస్తుంది. ఇవి నీటిలో అలా అలా కదులుతుంటే మనసు గాల్లో తేలిపోక మానదు. ఇవి యజమానులను గుర్తించడమే కాదు, మనం నేర్పించే టాస్క్‌లు కూడా నేర్చుకుంటాయి.


అక్వేరియమ్‌లో రంగు రంగుల చేపలు

'ఆస్కార్' చేపలు..
ఆస్కార్ ఫిష్‌లు గోల్డెన్, బ్లాక్, బ్లూ కలర్‌లో ఉంటాయి. అందంగా ఫ్రెండ్లీగా ఉండి పెంచుకునే వారిని ఇట్టే గుర్తు పట్టేస్తాయి. వీటికి ట్రైనింగ్ ఇస్తే ముద్దు ముద్దుగా చెప్పినట్లు వింటాయి.

హచ్ డాగ్స్‌లా..
పేరుకు తగ్గట్టే ఏంజెల్‌లా ఉంటాయి. ఈ చేపలు అక్వేరియంలోని ఇతర చేపలతో ఫ్రెండ్‌షిప్ చేస్తాయి. యజమానులు ఎటువెళ్తే అటు చూస్తాయి. ఇక ఫుడ్ పెట్టేటప్పుడు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంటాయి.

ఇంటెలిజెంట్..
గోల్డ్‌ఫిష్ అంటే చాలామందికి తెలిసే ఉంటుంది. అక్వేరియం ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరూ గోల్డ్ ఫిష్ పెంచుకుంటారు. వీటికి జ్ఞాపకశక్తి, తెలివి చాలా ఎక్కువ. వీటికి కూడా మనకు నచ్చినట్లు ట్రైనింగ్ ఇచ్చుకోవచ్చు.

ఎరీ..క్యూరియస్ గయ్..
గౌరమి అనే రకం చేపలు క్యూరియస్‌గా ఉంటాయి. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తితో ఉంటాయి. ఒకే ప్రాంతంలో నివాసం ఉంటూనే.. చుట్టుపక్కల ఏం ఉన్నాయనే విషయాలు తెలుసుకుంటాయి. చుట్టుపక్కల చేపలతో ఫ్రెండ్లీగా ఉండడమే కాకుండా యజమానులను గుర్తుంచుకుంటాయి.

సున్నితమైన మనస్తత్వం..



చేపపిల్లలు చాలా సున్నితమైన మనస్తత్వం కలిగి ఉంటాయి. ఇంటిలో కుక్కలను పెంచుకుంటే ఏ విధంగా ఫ్రెండ్లీగా ఉంటాయో.. అదేవిధంగా చేప పిల్లలు కూడా మనతో ఫ్రెండ్లీగా ఉంటాయి. పెద్ద అక్వేరియం ఏర్పాటు చేసి నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు చెక్ చేయాలి. చేపలకు మన మీద నమ్మకం రావడానికి సమయం పడుతుంది. కొత్త రకం చేపలు కనిపిస్తే చాలు వెంటనే తమ అక్వేరియంలోకి తీసుకొచ్చుకుంటా.

- సునీల్, చేపల పెంపకం ప్రియుడు, తిరుపతి

జాగ్రతగా కాపాడుకోవాలి..



చేపలను పెంచుకోవాలని ఇష్టపడడమే కాదు. వాటిని కంటికి రెప్పలా, చంటి బిడ్డలను చూసుకున్నట్లుగా జాగ్రతగా చూసుకోవాలి. సరైన సమయంలో ఫుడ్ పెట్టాలి. ఎప్పటికప్పుడు అక్వేరియంలో నీటిని మారుస్తుండాలి. మోటార్లతో ఆక్సిజన్ ఉండేలా జాగ్రతపడాలి. లేదంటే వైరస్ బారిన పడి చేపలు చనిపోతుంటాయి.

- పి.లక్ష్మి, తిరుపతి

నేటి వాహన సేవలు

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సూర్యప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్య భగవానుడికి తానే ప్రతిరూపం అని స్వామివారు ఈ వాహనం మీద ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ క్రమంలోనే రాత్రి చంద్ర ప్రభ వాహనంపై శ్రీవారు కొలువుదీరి 7 నుంచి 9 గంటల వరకు మాడ వీధుల్లో విహరించనున్నారు. సూర్యుడి తీక్షణం, చంద్రుని శీతలత్వం రెండు తన అంశమేనని స్వామివారు ఈ వాహనాల ద్వారా తెలియజేయనున్నారు.

12న కోతకాల పండుగ

పాకాల : స్థానిక సీఎస్ఐ చర్చిలో శనివారం, ఆదివారం రెండు రోజులపాటు కోతకాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు పాస్టర్ ప్రేమ్‌కుమార్, పాస్ట్రేట్ సెక్రటరీ రఘువేలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శనివారం ఉదయం ప్రత్యేక ఆరాధ, అనంతరం పిల్లలు, యువత, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే సామూహిక భోజనాలు చేపట్టనున్నట్లు వివరించారు.

వలంటీర్ల ఉద్యోగ భద్రతకు వినతి


డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

తిరుపతి తుడా : వలంటీర్లను తక్షణం విధుల్లోకి తీసుకుని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. బుధవారం కేటీ రోడ్డు నుంచి భవానీ నగర్ ఓల్డ్ మెటీరియల్ హాస్పిటల్ రోడ్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సచివాలయం ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు టి.రామకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లకు రూ.10వేల వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు గడుస్తున్నా నాలుగు నెలలుగా జీతాలు సైతం చెల్లించలేదని మండిపడ్డారు. ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునిరాజా, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటివ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్, వలంటీర్ల సంఘం నేత బాలు, నాయకులు సుప్రజ, రమణి, దివ్యవాణి, మహేష్ బాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడి

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ భారతి తెలిపారు. మంగళవారం కుక్కంబాకం, కంచనపుత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో రసాయనిక మందులను వాడవలసిన అవసరం ఉండదని, పంటలు బాగా పండుతాయని వెల్లడించారు. ఆరు తడి పంటలను సాగు చేస్తే నీటి అవసరం తక్కువగా ఉంటుందని వివరించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

యోగాలో సుజాతకు స్వర్ణ పతకం


స్వర్ణ పతకం అందుకున్న సుజాత

శ్రీకాళహస్తి: కర్నూలులో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన శ్రీశివసాయి యోగా సెంటర్ నిర్వాహకులు ఆయలం సుజాత ప్రతిభను ప్రదర్శించారు. ప్రథమ స్థానం దక్కించుకుని బంగారు పతకం అందుకున్నారు. ఈ క్రమంలోనే త్వరలో నిర్వహించనున్న జాతీయ

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్

తిరుపతి సిటీ : శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ రీసెర్చ్, టాటా ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ హాజరై కళాశాల సిబ్బంది, విద్యార్థులకి క్యాన్సర్ రకాలు, వ్యాధి లక్షణాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. నోరు, ఛాతీ, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణాశయ, కాలేయ క్యాన్సర్ వంటి దాదాపు 100కు పైగా రకాలు ఉన్నాయని వెల్లడించారు. అవగాహన లేకపోవడంతోనే వ్యాధి తీవ్రత పెరిగి పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారని తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ రమేష్ బాబు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ హేమంత్ కుమార్, డాక్టర్ వెంకయ్య బాబు, స్టాఫ్ నర్స్ మెహతాజ్, డీఈఓ మహేందర్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ రెడ్డి కుమారి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌ని చితకబాదిన టీడీపీ నేత

తిరుపతి టాస్క్‌ఫోర్స్: రద్దీ ప్రదేశంలో తమ దుకాణానికి అడ్డుగా ఉన్న కారును తీయమన్నందుకు టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ మోహన్‌నాయుడు దుకాణం నిర్వాహకుడైన 75 ఏళ్ల వృద్ధుడు మునిరత్నంనాయుడిని చితకబాదారు. బుధవారం స్థానికుల కథనం మేరకు.. తమ దుకాణానికి అడ్డుగా ఉన్న కారును తీయమన్న విషయమై దుకాణం నిర్వాహకుడు మునిరత్నం నాయుడికి, టౌన్ ప్రెసిడెంట్ మోహన్‌నాయుడు మధ్య వాదనలు జరిగాయి. దుకాణం నిర్వాహకుడు దురుసుగా ప్రవర్తించి, అసభ్యకర పదజాలంతో మోహన్‌నాయుడిని దూషించాడు. అడ్డుగా ఉన్న కారును తీయడానికి నిరాకరించిన మోహన్‌నాయుడు సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయాడు. తిరిగిన తన అనుచరులతో దుకాణం వద్దకు చేరుకుని మునిరత్నంనాయుడిని చితకబాది, దుకాణంలోని వస్తువులను రోడ్డుపైకి చిందర వందరగా విసిరి పడేశారు. ఈ విషయమై బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించిన విషయం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఏదిఏమైనా వృద్ధుడిపై చేయి చేసుకోవడం దారుణమైన విషయమని స్థానికులు పలు విమర్శలు చేస్తున్నారు.

పదవికి పవన్ అనర్హుడు



మాట్లాడుతున్న రాఘవ శర్మ

తిరుపతి కల్చరల్ : సనాతన హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయమంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పదవికి అనర్హుడని పలువురు వక్తలు స్పష్టం చేశారు. సనాతన ధర్మం ప్రకారం క్షత్రియులు మాత్రమే పరిపాలన సాగించాలని తెలిపారు. బుధవారం గంధమనేని శివయ్య భవన్‌లో ×సనాతన ధర్మం–ప్రస్తుత రాజకీయాలు అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ మాట్లాడుతూ బీజేపీకి అసలు పునాదే లేని ఏపీలో ఆ పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే పవన్ కల్యాణ్ కాషాయ దుస్తులు ధరించి హడావుడి చేశారని ఆరోపించారు. కార్మిక నేత తుసేంద్ర మాట్లాడుతూ ఏ ధర్మం శాశ్వతం కాదని, కాలాన్ని బట్టి ధర్మం మారుతుందని, సనాతన ధర్మం అంతరించి పోయిందని వివరించారు. సీఐటీయూ జిల్లా నేత కందారపు మురళి మాట్లాడుతూ పవన్ కల్యాణ్ చెప్పింది సనాతన ధర్మం అయితే ఒక దళితుడిని ఈఓగా నియమించాలని, కనీసం జేఈఓగా అయినా దళితుడికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ దేశంలో సనాతన ధర్మాన్ని నిర్మూలించడమంటే ఆర్ఎస్ఎస్ వంటి శక్తుల ఆలోచనను నిర్మూలించగలడమే అని తెలిపారు. సామాజిక హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి చిన్నం పెంచలయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, శాకం నాగరాజు, నామిని సుబ్రమణ్యం, సోము ప్రకాష్, అధ్యాపకుడు గొడుగు చింత గోవిందయ్య, డాక్టర్ రమణ, టి.జనార్దన్, కె.రాధాకృష్ణ, జె.విశ్వనాథ్, చిన్నం కాళయ్య, ఎన్‌డీ రవి, బుజ్జమ్మ, రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చదువుల తల్లిగా శక్తిస్వరూపిణి





సరస్వతీదేవి అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ , అశ్వ వాహనంపై విహరిస్తున్న ఎల్లమ్మతల్లి , శ్రీశక్తి పీఠంలో అమ్మవారు, సురభి గో సంరక్షణ శాలలో..

- వైభవంగా శరన్నవరాత్రులు
- సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తిరుపతి కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీతాతయ్యగుంట గంగమ్మతల్లి సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవీ హోమం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సాయంత్రం గంగమ్మను సరస్వతీదేవి అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి వేడుకగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం ఉభయకర్తలకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జయకుమార్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..
చంద్రగిరి : శ్రీమూస్థాన ఎల్లమ్మదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం గాయత్రి అవతారంలో అమ్మవారు అశ్వ వాహనంపై కొలుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌తో పాటు అష్టలక్ష్మీదేవతలు, నాగదేవత, నవగ్రహదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తికి అభిషేక సేవ జరపించి, పట్టు పీతాంబరాలతో శోభాయమానంగా అలంకరించారు. రాత్రి గాయత్రిదేవిగా అమ్మవారు అశ్వవాహనంపై ఆశీనులై పురవీధుల్లో ఊరేగారు.విరుపాక్షి మమత శంకర్ రెడ్డి, పాకాల కృపాలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, చేతన్ కుమార్ రెడ్డి, చరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఈఓ మమత పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..
రామచంద్రాపురం: శ్రీశక్తి పీఠంలో నిర్వహిస్తున్న శ్రీదశ మహావిద్యా దివ్యోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ బగళాముఖీ దేవి అమ్మవారిని శక్తిపీఠం వ్యవస్థాపకులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతి విశేష పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకం, పూజలు, హోమం, స్త్రీమూర్తులకు సువాసినీ పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు చేపట్టారు. విజేతలకు పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని బహుమతులు అందజేశారు. ఈ క్రమంలోనే సూరావారిపల్లె సమీపంలోని సురభి గోసంరక్షణ శాలలో సరస్వతీ దేవికి విద్యార్థులు ప్రత్యేక పూజ చేశారు. ,